క్లుప్తంగా

నీటి సమస్య పరిష్కారం

పెద్దతిప్పసముద్రం : తాగునీటి సమస్యపై సాక్షి పత్రికలో వెలువడిన వార్తపై అధికారులు, కార్యదర్శులు స్పందించారు. మండలంలోని మద్దయ్యగారిపల్లి పంచాయతీ అంగడివారిపల్లిలో బోరు మోటారు మరమ్మతులు చేయించి తాగునీటి సమస్య పరిష్కరించారు. అదే విధంగా సంపతికోట పంచాయతీ ముంత పోగులవారిపల్లిలో పైప్‌లైన్ ఏర్పాటుకు చర్యలు చేపట్టినట్లు ఆయా గ్రామాల సర్పంచ్‌లు, కార్యదర్శులు పేర్కొన్నారు.

పంట నమోదు చేయించుకోవాలి

కలికిరి : రబీ సీజన్‌లో పంట సాగు చేసిన రైతులు తప్పనిసరిగా ఈ–క్రాప్ నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారిణి మమతారెడ్డి తెలిపారు. పంట నమోదుకు ఈ నెల 25 ఆఖరి గడువు కాగా, పంట నమోదు తరువాత ఈ నెల 26 లోపు ఈకేవైసీ కూడా చేయించుకోవాలని ఆమె కోరారు. అవసరమైన రైతులు ఆయా రైతు భరోసా కేంద్రాల్లో సంప్రదించాలన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

మదనపల్లె : రైతులు చిరుధాన్యాలు పండించడంపై మక్కువ కనబరుస్తున్నారని, మేలైన పంటల యాజమాన్య పద్ధతులతో వీటిలో అధికదిగుబడులు సాధించవచ్చని అన్నమయ్య జిల్లా డీఆర్సీ ఏడీఏ శ్రీకాంత్ తెలిపారు. మండలంలోని చిన్నతిప్పసముద్రం ఆర్‌బీకేలో గురువారం వరి, ఇతర పంటల్లో మేలైన యాజమాన్య పద్ధతులపై రైతు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. తక్కువ నీటితో, తక్కువ సమయంలో పోషకాలు పుష్కలంగా కలిగిన సజ్జ, కొర్ర, అరికలు, రాగి తదితర చిరుధాన్యాల ఆవశ్యకత, వాటి సాగులో తీసుకోవాల్సిన సస్యరక్షణపై తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వీహెచ్ఏ సుబ్రహ్మణ్యం, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది (జెడ్‌బీఎన్ఎఫ్), రైతులు పాల్గొన్నారు.

దుకాణాలలో తనిఖీ

గుర్రంకొండ : మండలంలోని తరిగొండ గ్రామంలో జిల్లా తూనికలు, కొలతల అధికారులు దాడులు నిర్వహించారు. గురువారం జిల్లా తూనికలు, కొలతల శాఖ సీఐ నాగరాజు ఆధ్వర్యంలో గ్రామంలోని పలు దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. దుకాణాలలో విక్రయించే సరుకులు, వస్తువులను పరిశీలించారు. వస్తువుల నాణ్యత, అవి ఎక్కడ తయారయ్యాయి. ఎమ్మార్పీ ధర తోపాటు కంపెనీ వివరాలు పరిశీలించారు. పలు దుకాణాల్లోని వస్తువుల్లో ఇలాంటి వివరాలు లేక పోవడంతో కేసులు నమోదు చేశారు. నిబంధనలకు అనుగుణంగా వస్తువులు విక్రయించాలని వారు సూచించారు. లేకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

గుర్రంకొండ : కళాశాల విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని తహసీల్దార్ ఖాజాబీ, ఎస్ఐ దిలీప్‌కుమార్‌లు అన్నారు. గురువారం స్థానిక తెలుగు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రీడ్ సంస్థ ఆధ్వర్యంలో వ్యక్తిత్వవికాసం, లక్ష్యం– మత్తు పదార్థాల వినియోగం– వాటి అనర్థాలు అన్న అంశంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. యువత మత్తు పదార్థాలకు అలవాటు పడితే భవిష్యత్తు నాశనం అవుతుందన్నారు. చెడు అలవాట్లకు దూరంగా ఉండి చక్కగా చదువుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రీడ్ సంస్థ ప్రధాన కార్యదర్శి ఈశ్వరయ్య, అధ్యాపకులు, పోలీసులు పాల్గొన్నారు.

వైద్య పరీక్షలు

కలికిరి: పల్లవోలు గ్రామం గడిలో తిరుపతి రమాదేవి స్పెషాలిటీ ఆసుపత్రి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 150 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి వారిలో 13 మందిని ఆరోగ్యశ్రీ శస్త్రచికిత్సలకు ఎంపిక చేసినట్లు నిర్వాహకుడు ముని తెలిపారు. ఎంపికైన గర్భకోశ వ్యాధులు, మోకాళ్ళు చికిత్సలు ఉచితంగా నిర్వహించి మందులు పంపిణీ చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బేబి ఆయేషా, సింగిల్ విండో మాజీ డైరెక్టర్ జుబేర్ అహ్మద్, ఇస్తియాక్ అహ్మద్, రమాదేవి ఆసుపత్రి వైద్యులు పాల్గొన్నారు.

మార్కెట్ యార్డు స్థల పరిశీలన



కురబలకోటలో మార్కెట్ స్థలాన్ని పరిశీలిస్తున్న చీఫ్ ఇంజినీరు

కురబలకోట : మార్కెటింగ్ శాఖ చీఫ్ ఇంజినీరు ఎం. శ్రీనివాస్ గురువారం అంగళ్లు మార్కెట్ యార్డు స్థలాన్ని పరిశీలించారు. కురబలకోట రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్‌ఓబీ) పక్కన ఎంపిక చేసిన స్థలాన్ని ఆయన పరిశీలించారు. గుట్ట ప్రాంతంలో మార్కెట్ కమిటీ ఏర్పాటు పట్ల మార్కెట్ కమిటీ చైర్మన్ డీఆర్. ఉమాపతిరెడ్డితో చర్చించారు. ఏ స్థలంలో ఏఏ భవనాలు నిర్మించవచ్చో పరిశీలించారు. కమిషనర్‌కు ప్రతిపాదనలు పంపుతున్నట్లు సీఈ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈఈ వెంకటేశ్వరరావు, జేడీ రామాంజులు, డీఈ సంపత్ బాబు, ఏడీ త్యాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా ఎమ్మెల్సీ ఎన్నికలు నిర్వహిస్తాం

- ఎమ్మెల్సీ ఓటర్లు 39,824 మంది
- పోలింగ్ కేంద్రాల్లో వసతుల ఏర్పాటు
- మదనపల్లె ఆర్డీఓ మురళీ



బి.కొత్తకోటలో పోలింగ్ కేంద్రం పరిశీలిస్తున్న ఆర్డీఓ మురళీ

బి.కొత్తకోట : పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఇప్పటివరకు 39,824 మంది ఓటర్లు నమోదై ఉన్నారని మదనపల్లె ఆర్డీఓ ఎంఎస్.మురళీ అన్నారు. గురువారం ఆయన బి.కొత్తకోట బాలికల జెడ్పీ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. గదుల్లో సౌకర్యాలు, సిబ్బందికి వసతులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ మదనపల్లె డివిజన్‌లో పట్టభద్రుల ఓటర్లు 23,736, ఉపాధ్యాయ ఓటర్లు 16,088 మంది ఉన్నట్టు చెప్పారు. ఎన్నికల నిర్వహణ కోసం ఒక్కో పోలింగ్ కేంద్రానికి ఒక పీఓ, ఒక ఏపీఓ, ముగ్గురు ఓపీఓలు ఉంటారని చెప్పారు. 8 మంది సెలక్టోరల్ అధికారులు విధుల్లో ఉంటారన్నారు. ఎన్నికల సామగ్రిని మదనపల్లె జెడ్పీ హైస్కూల్ నుంచి పంపిణీ చేస్తామన్నారు. ఎన్నికలను సూక్ష్మస్థాయిలో పరిశీలించడం, నిఘా కోసం మైక్రోలెవల్ అధికారులను నియమిస్తామన్నారు. డివిజన్ పరిధిలో 11 మండలాలు ఉండగా ఈ ఎన్నికల కోసం రాయచోటి డివిజన్ పరిధి పీలేరు నియోజకవర్గానికి చెందిన నాలుగు మండలాలను కూడా పర్యవేక్షిస్తామన్నారు. ఎన్నికల నిర్వహణ పకడ్బందీగా ఉంటుందన్నారు. ఆయన వెంట తహసీల్దార్ ధనుంజయులు, ఏడీఏ శివశంకర్, ఎంపీడీఓ శంకరయ్య, ఎస్ఐ రామమోహన్, ఆర్ఐ బాలాజీ, వీఆర్‌ఓలు అమర, వెంకటరమణ పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

పెద్దతిప్పసముద్రం : ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో గురువారం ఎన్నికల సెక్టోరల్ అధికారి శివశంకర్ స్థానిక జెడ్పీ హైస్కూల్‌లోని పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. ఓటు హక్కు వినియోగించుకునే కేంద్రాల్లో వెలుతురు, ఫ్యాన్లు, కిటికీలు, తలుపులు తదితర సౌకర్యాలపై ఆరా తీశారు. ఆయన వెంట తహశీల్దార్ విద్యాసాగర్, ఎంపీడీఓ గిరిధర్‌రెడ్డి, ఎస్ఐ మధురామచంద్రుడు ఉన్నారు.

ములకలచెరువు : వచ్చే నెలలో జరగబోయే ఎమ్మెల్సీ ఎన్నికల కోసం ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని సీఐ సాదిక్ అలీ, తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంఈఓ వెంకటరమణ గురువారం పరిశీలించారు. పోలింగ్ విధులు నిర్వహించే అధికారులు, పోలింగ్ ఏజెంట్లు కూర్చునే వరుస క్రమం, లైటింగ్, తాగునీరు అంశాలను పరిశీలించారు. ఏఎస్ఐ నజీర్, హెడ్‌కానిస్టేబుల్ శంకర్‌నాయక్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

కురబలకోట : త్వరలో జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలకు పోలింగ్ బూత్‌లను తహశీల్దారు గురువారం పరిశీలించారు. కురబలకోట జడ్పీ హైస్కూల్‌లో మూడు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

మదనపల్లె : ఎమ్మెల్సీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో డీఎస్పీ కేశప్ప, తహసీల్దార్ సీకే.శ్రీనివాసులుతో కలిసి గురువారం పట్టణంలోని జెడ్పీహైస్కూల్‌లో ఏర్పాటుచేస్తున్న స్ట్రాంగ్‌రూమ్, పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు డీఎస్పీ పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఐలు మురళీకృష్ణ, శివాంజనేయులు, పోలీస్‌సిబ్బంది పాల్గొన్నారు.

పీలేరు : మార్చి 13న జరుగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాలను అధికారులు తనిఖీ చేశారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తహశీల్దార్ రవి, సీఐ మోహన్‌రెడ్డి, ఎంపీడీవో డాక్టర్ మురళీమోహన్‌రెడ్డి పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. ఎన్నికల డీటీ కిరణ్, ఆర్ఐ రాజశేఖర్, వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

తంబళ్లపల్లె : ములకలచెరువు సీఐ షాదిక్‌అలీ గురువారం తంబళ్లపల్లె కేంద్రం ఎమ్మార్సీ కార్యాలయంలో రెండు గదులలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఎన్నికల నిర్వహణ అంశాలపై ఎంఈవో త్యాగరాజుతో చర్చించారు. ఆయన వెంట ఎస్ఐ రామక్రిష్టారెడ్డి ఉన్నారు.

జీ 20 సదస్సుతో ప్రపంచానికి మార్గదర్శకం

పీలేరు రూరల్ : త్వరలో నిర్వహించనున్న జీ20 సదస్సుతో భారతదేశం ప్రపంచానికి మార్గదర్శకం చేయబోతోందని సంజయ్‌గాంధీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్ రెడ్డి అన్నారు. గురువారం స్థానిక డిగ్రీ కళాశాలలో ఎన్‌సీసీ యూనిట్ ఆధ్వర్యంలో జీ20 సదస్సుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రమేష్‌నాయుడు, ఎన్‌సీసీ అధికారి ఎం. వెంకటరమణయ్య, అధ్యాపకులు ఎల్. నారాయణస్వామి, భరణినాథ్‌రెడ్డి, సంధ్య, చంద్రబాబు, సరేష్, రాధాకృష్ణ, ఎన్‌సీసీ విద్యార్థులు పాల్గొన్నారు.

మాదిగల సంగ్రామ యాత్రను విజయవంతం చేయండి

కేవీపల్లె : ఈ నెల 25 నుంచి నిర్వహించనున్న మాదిగల సంగ్రామ యాత్రను విజయవంతం చేయాలని ఎంఎస్‌పీ మండల కన్వీనర్ డి. వెంకటాచలపతి అన్నారు. గురువారం కేవీపల్లెలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ కులాల వర్గీకరణ చట్టబద్ధత చేయడంలో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి చూపుతోందన్నారు. అందుకు నిరసనగా ఉమ్మడి చిత్తూరు జిల్లా నుంచి విజయవాడ వరకు సంగ్రామ యాత్ర చేపడుతున్నట్లు తెలిపారు.

అశ్వవాహనంపై సిద్దేశ్వరుడు



కలకడ : మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలలో భాగంగా కలకడ శ్రీకామాక్షి సమేత సిద్దేశ్వరస్వామి అశ్వవాహనంపై ఊరేగారు. 11రోజులు పాటు నిర్వహించనున్న ఈ ఉత్సవాలలో భాగంగా ఈ ఏడాది 10వ రోజు అయిన బుధవారం రాత్రినుంచి గురువారం వరకూ మండలంలోని ఏకిలనాయుడు కులస్తులు వారికి కేటాయించిన అశ్వవాహనంపై స్వామిని పురవీధులలో ఊరేగించారు.

నేడు సోము వీర్రాజు రాక

బి.కొత్తకోట : మండలంలోని అమరనారాయణపురంలో శుక్రవారం కార్యకర్తల సమావేశానికి బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు సోము వీర్రాజు హాజరవనున్నారు.

వినియోగదారుల మన్ననలు పొందాలి



బిగ్‌బజార్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా

మదనపల్లె : పట్టణంలోని సీటీఎంరోడ్డులోని జీఎస్ ఆర్ టవర్స్‌లో నూతనంగా ఏర్పాటుచేసిన శరవణ బిగ్‌బజార్ వినియోగదారుల మన్ననలు పొందాలని ఎమ్మెల్యే నవాజ్‌బాషా ఆకాంక్షించారు. గురువారం శరవణ బిగ్‌బజార్‌ను ప్రారంభించిన ఆయన సూపర్‌మార్కెట్ ఏర్పాటుపై కేరళకు చెందిన కే.కే.మహమ్మద్, రియాజ్, సయ్యద్‌లను అభినందించారు. సూపర్‌మార్కెట్‌లో స్థానికులైన 55 మంది మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించినందుకు యాజమాన్యాన్ని అభినందించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మేస్త్రీ శ్రీనివాసులు, ఎల్ఐసీ.సుధాకర్, బావాజాన్, కృష్ణగోపాల్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీని మరింత బలోపేతం చేయాలి

పీలేరు : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయాలని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. గురువారం కలకడ ఎంపీడీవో కార్యాలయంలో నూతనంగా జిల్లా పార్టీ పదవులు పొందిన పంచాయతీరాజ్ అధ్యక్షులు డాక్టర్ హబీబ్‌బాషా, మహిళా అధ్యక్షురాలు కె. మహిత, గ్రామ సచివాలయ మండల కన్వీనర్ ఆనంద్‌ను సన్మానించారు. మైనారిటీ కమిషన్ చైర్మన్ డాక్టర్ ఇక్బాల్‌అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

నగర పంచాయతీలో రూ.1.82 కోట్ల పనులు

బి.కొత్తకోట : నగర పంచాయతీ పరిధిలో ప్రజల సమస్యల పరిష్కారం కోసం రూ.1.82 కోట్ల వ్యయంతో అభివృద్ధి పనులు చేపట్టినట్టు కమిషనర్ పలసాని నరసింహ ప్రసాద్ చెప్పారు. గురువారం ఆయన మాట్లాడుతూ గత ఏడాది ఎంపీ ల్యాడ్స్, జీజీఎంపీ, 15వ ఆర్థిక సంఘ నిధులతో టెండర్లు నిర్వహించిన పనుల్లో ఇందిరమ్మ కాలనీ, బీసీ కాలనీ, జనుపవారిపల్లెల్లో పైప్‌లైన్ పనులు పూర్తయినట్టు చెప్పారు. తాకాటంవారిపల్లె సచివాలయం పరిధిలో రూ.55.34 లక్షలు, పాశంవీధి సచివాలయం పరిధిలో రూ.28.60లక్షలు, బీసీకాలనీ సచివాలయం పరిధిలో రూ.32.89 లక్షలు, సింహం వీధి సచివాలయం పరిధిలో రూ.30.60 లక్షలు, నందిశెట్టివీధి సచివాలయం పరిధిలో రూ.34.81 లక్షలతో మురికినీటి కాలువలు, పైప్‌లైన్, రోడ్ల పనులు చేపట్టినట్టు చెప్పారు. కాగా హడ్కో కాలనీ, బీసీకాలనీల్లో రెండు తాగునీటి బోర్లు మంజూరైనట్టు చెప్పారు.

నాణ్యమైన వస్తువులు సరఫరా చేయడమే ధ్యేయం

వాల్మీకిపురం: రైతుల దగ్గర నుంచి పప్పులు, తినుపదార్థాలు సేకరించి వాటిని ప్రాసెస్ చేసి నాణ్యమైన వస్తువులను సరఫరా చేయడమే ఫుడ్ ప్రాసెసింగ్ సెంటర్ ధ్యేయమని డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ తెలిపారు. గురువారం స్థానిక వెలుగు కార్యాలయంలో సీసీలు, సంఘమిత్రలు, మహిళా మార్టు సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేయూత మహిళా మార్టుకు అనుబంధంగా ఫుడ్ ప్రాసెసింగ్ సెంటర్‌ను త్వరలో ప్రారంభించనున్నట్లు తెలిపారు. డీపీఎంలు రూతు, వెంకటరమణ, జవహర్‌బాషా, ఏపీఎం నరసింహులు, సిసిలు, సంఘమిత్రలు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : కుటుంబసమస్యలతో మనస్తాపం చెంది వివాహిత పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. పట్టణంలోని బాబుకాలనీకి చెందిన ప్రశాంత్ భార్య నందిని(26) పలువురి వద్ద అప్పులు చేసి పుట్టింటివారికి ఇచ్చిందని, ఈ విషయం ఇటీవల అత్తింటివారికి తెలియడంతో వారు మందలించారు. దీంతో మనస్తాపం చెందిన ఆమె గురువారం ఇంట్లోనే పురుగుల మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించింది. గమనించిన స్థానికులు బాధితురాలిని జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

రక్తహీనతను అధిగమించడమే లక్ష్యం

రామసముద్రం : రక్తహీనతను అధిగమించడమే లక్ష్యమని రివైసిడ్‌చైల్డ్ హెల్త్ స్టేట్ నోడల్ అధికారి డాక్టర్ విజయకుమార్ అన్నారు. అనిమియాముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా గురువారం రామసముద్రం ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని మదనపల్లె డివిజన్ డిప్యూటి డిఎంహెచ్‌వో డాక్టర్ లక్ష్మీ, హెల్త్‌ఎడ్యుకేటర్ మహమ్మద్‌రఫీలతో కలసి సందర్శించారు. ఈ సందర్భంగా గర్భవతులకు ఆరోగ్యకేంద్రాల నుంచి అందుతున్న సేవలపై ఆరా తీశారు. ప్రతి గర్భవతి రక్తహీతనకు గురికాకుండా ఉండేందుకు క్రమం తప్పకుండా హెచ్‌బి పరీక్షలు చేయించుకుని ఐరెన్ సంవృద్ధిగా గల ఆహారం తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ లీల, సిహెచ్‌వో రమాదేవి, ఆరోగ్య విస్తరణ అధికారులు హరినాథ్, రమణ, పర్యవేక్షకులు శ్యాం సుందర్ పాల్గొన్నారు.

కలికిరి : రక్తహీనత సమస్యను రూపుమాపడమే లక్ష్యంగా పని చేయాలని రివైసీడ్ చైల్డ్‌హెల్త్ రాష్ట్ర నోడల్ అధికారి డాక్టర్ విజయ్ కుమార్ వైద్య సిబ్బందిని ఆదేశించారు. అనిమియా ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా కలికిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. గర్భవతులకు అందుతున్న సేవలపై విచారించారు. కార్యక్రమంలో డాక్టర్ కావ్య, సీహెచ్‌ఓ ఇందిరాదేవి, హెచ్‌ఈ మహమ్మద్ రఫీ, హెల్త్ సూపర్‌వైజర్‌లు హేమలత, సాలమ్మ, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

సెక్టోరల్ అధికారులదే కీలక బాధ్యత

మదనపల్లె : ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ కేంద్రాల పరిశీలన మొదలుకుని పోలింగ్ ముగిసి బ్యాలెట్ బాక్స్‌లను స్ట్రాంగ్‌రూమ్‌లో భద్రపరిచే వరకు సెక్టోరల్ అధికారులే కీలక బాధ్యత వహించాల్సి ఉంటుందని ఆర్డీఓ ఎం.ఎస్.మురళీ అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలను పురస్కరించుకుని గురువారం ఆర్డీఓ కార్యాలయంలో మదనపల్లె రెవెన్యూ డివిజన్ పరిధిలోని సెక్టోరల్ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆర్డీఓ మాట్లాడుతూ.. సెక్టోరల్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. మదనపల్లె రెవెన్యూ డివిజన్ పరిధిలోని 15 మండలాలకు సంబంధించి 44 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని, అందులో 29 పట్టభద్రులకు, 15 ఉపాధ్యాయులకు కేటాయించామన్నారు. వీటికి 8 రూట్‌లను ఏర్పాటుచేసి 8 మంది ఏడీ, డీఈ స్థాయి అధికారులను సెక్టోరల్ అధికారులుగా నియమించామన్నారు. మదనపల్లె రెవెన్యూ డివిజన్ పరిధిలో ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన డిస్ట్రిబ్యూషన్, రిసీవింగ్ సెంటర్‌గా జెడ్పీ హైస్కూల్‌ను నిర్ణయించామని, మార్చి 12న ఇక్కడి నుంచే ఎన్నికల సామగ్రి పంపిణీ చేస్తామన్నారు. 13 ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎన్నికలు జరుగుతాయన్నారు. పీఓ, ఏపీఓలకు మార్చి 1న జిల్లా కేంద్రం రాయచోటిలో శిక్షణకార్యక్రమం ఉంటుందని తెలిపారు. సెక్టోరల్ అధికారులకు శుక్ర, శని రెండురోజుల పాటు బ్యాలెట్ బాక్స్‌లపై శిక్షణకార్యక్రమం ఉంటుందన్నారు.

రాష్ట్రంలో సంక్షేమ పాలన



ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

కలకడ : రాష్ట్రంలో సంక్షేమ పాలన సాగుతోందని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. రాష్ట్రం మొత్తం ప్రతి ఇంటిలో మా నమ్మకం నువ్వే జగన్ అంటున్నారన్నారు. గృహసారథులు, వాలంటీర్లు ప్రభుత్వం అందించిన సహకారాన్ని ప్రజలకు తెలియజేయాలని అన్నారు. గురువారం కలకడ శ్రీనివాసులరెడ్డి భవనంలో కన్వీనర్ కమలాకర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన మండలస్థాయి కార్యకర్తలు, గృహసారథులు, వాలంటీర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, అభిమానులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మాజీ మంత్రి నారా లోకేష్ చేపట్టిన పాదయాత్రకు డబ్బు లిచ్చినా ప్రజాదరణ లేదన్నారు. జనసేన పార్టీకి ఒక్క ఎమ్మెల్యే, ఎంపీపీ, జడ్పీటీసీ, ఎంపీటీసీ, కనీసం సర్పంచ్ కూడా లేరని నియోజకవర్గ పరిశీలకుడు సహదేవరెడ్డి అన్నారు. బాబుతో పొత్తు అంటే నట్టేట మునిగినట్లే అని, అన్ని పార్టీలు భయపడే పరిస్థితి రాష్ట్రంలో ఉందన్నారు. రాష్ట్ర మైనార్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ ఇక్బాల్ అహమ్మద్ మాట్లాడుతూ ప్రతి కుటుంబానికి లబ్ధిచేకూరిన విషయం తెలియజేయాలన్నారు. అనంతరం మండల జేసీఎస్ కన్వీనర్ మోహన్‌రాజ్ ను సన్మానించి, బాధ్యతలు అప్పగించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ శ్రీదేవి, జడ్పీటీసీ సభ్యురాలు హారిక, కోన సర్పంచ్ జల్లా రాజగోపాల్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బరకం రవికుమార్‌రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షులు కమలాకర్‌రెడ్డి, మండల కోఆప్షన్ సభ్యులు ఇనాయతుల్లా, మండల ఉపాధ్యక్షులు ఈశ్వర్ నాయుడు, ఫావత్ అల్లీఖాన్, ప్రత్యేక ఆహ్వానితులు జివికిషోర్, ఎంపీటీసీ సభ్యులు క్రిష్టారెడ్డి, సుజాత, సర్పంచ్‌లు రామచంద్ర, నరసింహారెడ్డి, రవికుమార్, జయప్రకాష్, ప్రకాష్‌రెడ్డి, కుమార్‌రెడ్డి, కుమార్‌నాయుడు, సుధాకర తదితరులు పాల్గొన్నారు.

ప్రతిపైసాకు లెక్కలు

బి.కొత్తకోట : పెద్దతిప్పసముద్రం మండల పరిషత్ నిధులకు సంబంధించిన ప్రతిపైసాకు లెక్కలు ఉన్నాయని ఎంపీడీఓ గిరిధర్‌రెడ్డి స్పష్టం చేశారు. నిధులపై టీడీపీ శ్రేణుల తప్పుడు ఆరోపణలపై ఆయన మీడియాతో మాట్లాడారు. 2022 ఏప్రిల్ ఒకటి నుంచి ఇప్పటి వరకు మండలానికి జనరల్ ఫండ్, 15వ ఆర్థిక సంఘ నిధులు కలుపుని రూ.1,10,91,784 వచ్చాయన్నారు. ఈ నిధుల్లో సమస్యలు, అభివృద్ధి పనులకు సంబంధించి ప్రజల నుంచి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డికి అందిన వినతులపై చర్యలు తీసుకున్నట్టు చెప్పారు. ఈ నిధుల్లో ఇంత వరకు రూ.47,72,801 ఖర్చు చేసి 35 పనులు చేపట్టి పూర్తి చేశామని చెప్పారు. ఇంకా రూ.63,18,983 నిధులు ఉన్నాయని చెప్పారు. ఈ నిధులతో మండలంలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రతిపాదనలు చేశామన్నారు. నిధుల వినియోగంపై ఎవరు వివరాలు కోరినా ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు.

అధిక దిగుబడే లక్ష్యం

పీలేరు రూరల్ : ఉద్యాన పంటల్లో రైతులు అధిక దిగుబడులు సాధించడమే లక్ష్యంగా తోటబడి కార్యక్రమం తీసుకొచ్చినట్లు ఏడీఏ వై.వి. రమణరావు అన్నారు. గురువారం స్థానిక సీఎల్ ఆర్‌సీ కార్యాలయంలో పీలేరు, కలకడ, కేవీపల్లె మండలాల వీహెచ్ఏలకు తోటబడి కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఏవో కరుణాకర్‌రెడ్డి, హెచ్‌వో సుకుమార్‌రెడ్డి, ఏఈవో నజీర్, ఆర్‌బీకే సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరికి తీవ్రగాయాలు

మదనపల్లె : వేర్వేరు రోడ్డుప్రమాదాల్లో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. పట్టణంలోని నీరుగట్టువారిపల్లెకు చెందిన అశ్విత్(32) చేనేత కార్మికుడిగా పని చేస్తున్నాడు. బుధవారం రాత్రి సొంతపనులపై ద్విచక్రవాహనంలో బి.కొత్తకోట మండలం కర్నాటక రాష్ట్ర సరిహద్దులోని చేలూరుకు బయలుదేరాడు. దారిలో వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. బాధితున్ని స్థానికులు 108 అంబులెన్స్‌లో మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

నిమ్మనపల్లె మండలం తురకపల్లెకు చెందిన బాబ్‌జాన్(26) భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తున్నారు. గురువారం తన ద్విచక్రవాహనానికి పెట్రోల్ నింపుకునేందుకు నిమ్మనపల్లె నుంచి కందూరు రోడ్డులో వెళుతుండగా దారిలో ఎదురుగా వస్తున్న మరో ద్విచక్రవాహనం ఢీకొంది. ప్రమాదంలో బాబ్‌జాన్ తీవ్రంగా గాయపడ్డాడు. బాధితున్ని స్థానికులు 108 అంబులెన్స్‌లో మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు.

ఒకరికి తీవ్ర గాయాలు

పెద్దతిప్పసముద్రం : మండలంలోని కందుకూరు సమీపంలోని జింకల బోర్డు వద్ద రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. కర్నాటక రాష్ట్రం బాగేపల్లి తాలూకా జంగాలపల్లికి చెందిన అజ్మత్ (27) ద్విచక్ర వాహనంలో మద్దయ్యగారిపల్లి వైపు వెళుతుండగా జింకల బోర్డు వద్ద ద్విచక్ర వాహనం ప్రమాదవశాత్తు అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో వాహనదారుడి ఎడమ కాలు విరిగింది. క్షతగాత్రుడిని 108 వాహనంలో ఆసుపత్రికి తరలించారు.



